వరలక్ష్మీ నమస్తుభ్యం...



పూసపాటిరేగ: కోనాడలో వరలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు నాగరాజుశర్మ



పూసపాటిరేగ: వరలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రావణమాస శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరాలిచ్చే లక్ష్మీ స్వరూపాన్ని పూజించుకోవడం హిందూ సంప్రదాయం. మహిళలందరూ ఈ వ్రతాన్ని చేయడంతో ఇళ్లల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ వ్రతాన్ని చేయడం వల్ల అష్టైశ్వర్యాలతో పాటు జ్ఞాన, గుణ సంపదలు కలుగుతాయని నమ్మకం. అమ్మవారి చిత్రపటానికి పూలదండలు వేసి చీర, పసుపు, కుంకుమలు, డబ్బులు, బంగారం వంటి వస్తువులు పూజా మందిరంలో ఉంచి అమ్మవారిని పూజించారు. అలాగే అమ్మవారికి పాయసం, పులిహోర, గారెలు, తదితర నైవేద్యం సమర్పించారు. వాడవాడలా ఈ వ్రతాలు ఆచరించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అలాగే ఆలయాల్లో కూడా సామూహిక కుంకుమ పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు పోటెత్తడంతో అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్




విజయనగరం ఫొటోగ్రాఫర్ : ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు



విజయనగరం ఫొటోగ్రాఫర్ : సంతోషిమాత అమ్మవారిని దర్శించుకున్న భక్తులు




నెల్లిమర్ల రూరల్: చందన అలంకరణలో రామతీర్థం మహాలక్ష్మి అమ్మవారు



విజయనగరం ఫొటోగ్రాఫర్ : గాజుల అంకరణలో పైడితల్లి అమ్మవారు



విజయనగరం ఫొటోగ్రాఫర్ : కరెన్సీ అలంకరణలో కన్యకాపరమేశ్వరి



విజయనగరం టౌన్: కలువపువ్వుపై కూర్చొని మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సన్యాసినాయుడు

డెంకాడ: మండల పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ఎ.సన్యాసినాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. సహచర సిబ్బంది ఆయన్ను అభినందించారు.

పైడితల్లికి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి ఆలయంలో చండీయాగం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు సాయి, వెలువలపల్లి నరసింహమూర్తి యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బదిలీ అధికారికి సన్మానం



బదిలీ ఎంపీడీఓ లవరాజును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది

డెంకాడ: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎ.లవరాజును శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో లవరాజు అందించిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై దర్యాప్తు



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం: మండల పరిధిలో గల గుంకలాం, కొండకరకాం గ్రామాల్లో జగనన్న హౌసింగ్ కార్యక్రమంలో భాగంగా రాక్రీట్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన గృహ నిర్మాణాలపై దర్యాప్తు చేస్తున్నామని శ్రీకాకుళంలోని ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎ. సురేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో జరిగిన గృహ నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సంస్థకు గుంకలాంలో 5097, కొండకొరకాంలో 958 కలిసి మొత్తం 6055 ఇళ్లు కేటాయించగా.. ఇప్పటివరకు ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి చేయలేదని చెప్పారు.

పరిశోధనలపై యువత దృష్టి సారించాలి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నెల్లిమర్ల రూరల్: పరిశోధనలపై యువత దృష్టి సారించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో కుట్టు యంత్రాల శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు అవసరమైన నైపుణ్యాలు నేర్చుకోవడానికి తగిన సౌకర్యాలు వర్సిటీలో ఉన్నాయని, భవిష్యత్తులో కలిసి పని చేద్దామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమరావతిలో నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని, అవసరమైన సహకారం అందించాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను సందర్శించి అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, వీసీ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్లు ప్రొఫెసర్ రమణారావు, సన్నీ డయోల్, ఎంఎల్ఎన్ ఆచార్యులు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ట్రయల్ రన్

విజయనగరం క్రైమ్: విశాఖపట్టణం అక్కయ్యపాలెంలో ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ గోల్డెన్ జూబ్లీ స్టేడియంలో అగ్నివీర్, ఆర్మీ ర్యాలీ జరగనున్న నేపథ్యంలో తమ విద్యార్థులతో ట్రయల్ రన్ నిర్వహించినట్లు విజయనగరం డిఫెన్స్ అండ్ పోలీస్ అకాడమి డైరెక్టర్ అనిల్‌కుమార్ (ఎక్స్ ఎన్ఎస్‌జీ కమాండో) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న 40 మంది విద్యార్థులు పాల్గొని, విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారని పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

విజయనగరం ఫోర్ట్: కోల్‌కతాలో హత్యాచారానికి గురైన వైద్య విద్యార్థి మౌమితకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి విద్యార్థులు, జూనియర్ వైద్యులు శుక్రవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు హేమంత్ రెడ్డి, స్నేహిత, విశాల్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లవుతున్నా దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్లకు రక్షణ కల్పించాలని కోరారు. సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయలేదని ఆరోపించారు. పోస్టుమార్టం నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణ్‌రాజ్, దశరథన్, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

విజయనగరం: విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పరచుకుని చదవాలని, అప్పుడు మంచి ఫలితాలు వస్తాయని స్థానిక ఎస్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.సురేష్‌బాబు అన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఉల్లివీధి కార్యాలయంలో జరిగిన ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని సూచించారు. ఎంఈఓ సత్యవతి మాట్లాడుతూ, ప్రతిభా పురస్కారాలు పొందిన విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రాజెక్ట్ చైర్మన్ బొడ్డు కృష్ణారావు, సంఘ అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణమూర్తి, బలభద్రుని నానాజీ, కార్యదర్శి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు జనార్దనరావు, కార్యదర్శి రత్నారావు, డిమ్స్ రాజు, మండవిల్లి వెంకటరాజు, ఆకి సూర్యప్రకాశరావు, గూడూరు నరసింగరావు, ఉపేంద్ర, వజ్రపు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎంసీ ఎన్నికలు

గుర్ల: మండలంలోని పాలవలస, పెద్దబంటుపల్లి, కలవచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, గూడేం, పకీరుకిట్టాలి ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు వివిధ కారణాలతో వాయిదా పడిన విషయం తెలిసిందే. ఆయా పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలను శనివారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ భానుప్రకాష్ శుక్రవారం తెలిపారు. సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నేతలు సహకరించాలని కోరారు.

● ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేస్తున్న జెడ్పీటీసీ గారతవుడు, తదితరులు

గజపతినగరం: ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. గజపతినగరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఇంటి వద్ద బొత్స సత్యనారాయణను శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీటీసీ గారతవుడు, పార్టీ సీనియర్ నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, పల్లి సంజీవరావు, కర్రి రామునాయుడు, ఇనుముల రాజు, లోగిశ శ్రీను, ఆదాడ గోపి, రాపాక సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళాలివ్వండి...

● రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ పిలుపు

● నగరంలోని రెండు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభం



ప్రజలకు టిఫిన్ వడ్డిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

విజయనగరం: అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పిలుపునిచ్చారు. పేదలు, కార్మికులు, విద్యార్థులకు ఈ క్యాంటీన్లు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. అన్న క్యాంటీన్లను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందని, పేదల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సమాజంలోని అన్ని వర్గాల వారు విరాళాల రూపంలో తమ వంతు సహకారం అందించాలని కోరారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, మున్సిపల్ మార్కెట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రెండు అన్న క్యాంటీన్లను కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజుతో కలిసి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల అన్న క్యాంటీన్‌లో మంత్రి కొండపల్లి, మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లతో కలసి పలువురికి టిఫిన్ వడ్డించారు. అనంతరం వారంతా అక్కడే టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్ల నిర్వహణకు తన నెల జీతం విరాళంగా ఇస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. విరాళాలు ఇచ్చే వారి కోసం ప్రభుత్వం ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతా 37818165097 (గుంటూరు చంద్రామౌళి నగర్ బ్రాంచ్) ఏర్పాటు చేసిందని కలెక్టర్ అంబేడ్కర్ చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు, మున్సిపల్ ఇంజినీర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విజయనగరం: జిల్లా కేంద్రంలో ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 10 వరకు శిల్పారామం 11 కేవీ ఫీడర్ పరిధిలో గల పీవీజీ నగర్, శిల్పారామం, ఆటోబస్టాండ్ ఏరియా, జిల్లా కోర్టు ఏరియా ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. అదేవిధంగా పీజీ కాలేజ్ 11కేవీ ఫీడర్ పరిధిలో చేపట్టనున్న నిర్వహణ పనుల్లో భాగంగా వాడవీధి, ఎన్టీఆర్ జంక్షన్, పూల్‌బాగ్‌కాలనీ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. నిర్వహణ పనుల అనంతరం సరఫరాను పునరుద్ధరిస్తామని, ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నగదు ప్రోత్సాహకం అందజేత



లోహిత్‌కుమార్‌కు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న రమేష్

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ తన తండ్రి తాతారావు స్మారకార్థం ఏటా పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.లోహిత్‌కుమార్‌కు రూ.3 వేలు, టి.షణ్ముఖ్‌కు రూ.2 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని శుక్రవారం అందజేశారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

వాజ్‌పేయి గొప్ప దేశభక్తుడు



వాజ్‌పేయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బవిరెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప దేశభక్తుడని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి అన్నారు. వాజ్‌పేయి ఏడో వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలో ఆరు ప్రధాన నగరాలను కలుపుతూ వేసిన స్వర్ణ చతుర్భుజి ఆరులేన్ల రోడ్డు నిర్మాణం భారత దేశ ముఖచిత్రం మార్చేసిందన్నారు. సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందించాలన్న ఆయన కలలను ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ సాకారం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇప్పిలి గోపాలకృష్ణ, కంది సీతారాం, బూర జగ్గారావు, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించే గొప్ప నాయకుడు వాజ్‌పేయి


శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ ప్రధాని, స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా వాజ్‌పేయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా.సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ.. దేశంలో అన్ని రాజకీయ పార్టీలు గౌరవించే గొప్ప నాయకుడు, పార్లమెంటేరియన్ వాజ్‌పేయ్ అని కొనియాడారు. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లిన ఘనత వాజ్‌పేయ్‌కి దక్కిందన్నారు. రానున్న తరాలు వాజ్‌పేయ్‌ని ఆదర్శంగా తీసుకుని గొప్ప నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ ద్వారా పౌష్టికాహారం పంపిణీ

గంట్యాడ: అంగన్‌వాడీ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించాలని రీసెర్చ్ ఆఫీసర్ (న్యూఢిల్లీ) డాక్టర్ దీపక్ లోంధే అన్నారు. మండలంలోని నరవ 1,2 అంగన్‌వాడీ కేంద్రాలను, కొఠారుబిల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని స్టేట్ కన్సల్టెంట్ సునీతతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ అమలు ఏవిధంగా జరుగుతుందనేది పరిశీలించేందుకు వచ్చినట్టు చెప్పారు. దేశంలోని 6 రాష్ట్రాల్లో ఎఫ్ఆర్ఎస్ ద్వారా పౌష్టికాహార పంపిణీని పైలెట్ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మన రాష్ట్రంలో విజయనగరం జిల్లాలోని విజయనగరం, గంట్యాడ ఐసీడీఎస్ ప్రాజెక్టులను ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ శాంతకుమారి, సీడీపీఓ డోకుల ఉమాభారతి, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు అక్షరాస్యత వేదిక వార్షికోత్సవం



వీరజవాన్ రవివర్మ తల్లిదండ్రులను సన్మానిస్తున్న వేదిక ప్రతినిధులు

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక గ్రంథాలయంలో ఓటరు అక్షరాస్యత వేదిక తొలి వార్షికోత్సవాన్ని వ్యవస్థాపకులు డి.సూర్యారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ.. దేశంలో ఎన్నికల వ్యవస్థలో లోపాలను ఎత్తి చూపేందుకు 1999లో ప్రొఫెసర్ త్రిలోచనశాస్త్రి, జగదీష్ చొకర్, డా.అజిత్‌రనడే ఏడీఆర్ సంస్థను ఏర్పాటు చేయగా.. జయప్రకాశ్‌నారాయణ ఎఫ్‌డీఆర్‌ను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం వీరజవాన్ గనివాడ రవివర్మ తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి స్థానిక వైద్యులు ఆర్.త్రినాథరావు, జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ ఎం.కొండలరావు, లైబ్రేరియన్ డి.శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు ఆర్.సూరిదేముడు, సి.హెచ్.రామకృష్ణ, మొల్లేటి అప్పారావు, మురళి, లోకేష్, డి.మేఘన పాల్గొన్నారు.